


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 365 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 5 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥
VOLUME :12 ISSUE :365 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 5 SEPTEMBER 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## రాజమండ్రిలో సగం కాలుష్యానికి
# కారణం ఇదే

- పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు
- రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్
- పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు
- స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

**పుష్కర కాలంగా పన్ను ఎగవేత**

2016 నుంచి కాటేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని

- మిగతా 2లో

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్‌ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు.

అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక



ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు.

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.



# కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

- కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన
- మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్
- ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం
- ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

- మిగతా 2లో




# ఏపీలో ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా విడుదల

**పెన్ పవర్ డెస్క్:** 2026 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్ బోర్డు నుంచి 24 మందిని ఎంపిక చేసింది. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల పేరుతో జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ఈ అవార్డులను ఖరారు చేశారు. శనివారం గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం సత్కరించనుంది.

## నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల
# 60 ఏళ్ల నిరీక్షణకు తెర

- నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసులకు ఇళ్ల పట్టాల మంజూరు
- 60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం
- 1,215 పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కేబినెట్ నిర్ణయం
- మంత్రి నారాయణ చొరవతో సీఎం చంద్రబాబు ఆమోదం
- త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

- మిగతా 2లో





# ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

**అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!**

- మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్

- మిగతా 2లో

# పుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం.. డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

- మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలిన పైలట్‌ను తొలగించిన ఎయిర్ ఇండియా
- పుకెట్-ఢిల్లీ విమానంలో తీవ్ర ఘటన అనంతరం ఈ చర్యలు తీసుకున్న సంస్థ
- ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందికి గాయాలయ్యాయి
- పైలట్‌పై చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో సిఫారసు
- భద్రత విషయంలో తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టం చేసిన ఎయిర్ ఇండియా

- మిగతా 2లో



## దమ్ముంటే హరీశ్ రావు భార్య
# నాపై పోటీ చేయాలి

- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత
- తాను సీఎం కావాలని కోరుకుంటున్నానని వెల్లడి
- బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ

- మిగతా 2లో



## శ్రద్ధాంజలి



కీ॥శే॥ కప్పల మురళీ వెంకట బాల రామారావు (బాలు) గారు
Visakhapatnam Port Authority
(1970 - 2026)
(S/o. కప్పల జగ్గారావు (లేటు))

ప్రేమ, అనురాగం, ఆప్యాయతలను పంచి కుటుంబ శ్రేయస్సుకు, మా ఉన్నతికి
ఎంతగానో శ్రమించిన మీరు భౌతికంగా మా మధ్యన లేకపోయినా...
మీ మధుర జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా మదిలో పదిలం.
మీ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని మనసారా కోరుకుంటూ...

**కుటుంబ సభ్యులు**

తల్లి : కప్పల అమ్మాజీ
భార్య : నిర్మల వెంకట లక్ష్మి
కుమార్తె : కప్పల కీర్తన షణ్ముఖి
కుమారుడు : కప్పల గణేష్ శ్రీ దత్త
మావయ్య : కొలిపాక కూర్మారావు
అత్తయ్య : కొలిపాక ఛాయాదేవి

కొలిపాక గంగాధర్ (లేటు)
కొలిపాక సూర్య కుమారి
కొలిపాక సాయి శ్రీ వంశీ
కొలిపాక అరవింద్
కొలిపాక మధు
కొలిపాక ఆశ్రిత

**పెద్ద కర్మ :** తేది 05-09-2026 స్థిరవారం మధ్యాహ్నం 12 గంటల నుండి కళింగ ఫంక్షన్ హాల్, సీతమ్మధార, విశాఖపట్నం-2 నందు జరుపబడును.

## ఎడిటర్ వ్యూ

# తర్వాత వంతు ద్వారంపూడిదేనటగా.. వరస కేసులు రెడీ అవుతున్నాయా?

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది.

### స్థానిక సంస్థల ఎన్నికలలోపేనా?

స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది. ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది. కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్స్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది.

### టీడీఆర్ బాండ్ల కుంభకోణం...

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు. టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

# ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం.. జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు.

వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల 60 ఏళ్ల నిరీక్షణకు తెర

నెల్లూరు నగరంలో ఆరు దశాబ్దాలుగా నలుగుతున్న తీవ్రమైన సమస్యకు ఏపీప్రభుత్వం పరిష్కారం చూపింది. సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న సుమారు 1,215 నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస హక్కు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దశాబ్దాల తరబడి అభద్రతాభావంతో జీవిస్తున్న పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

### ఏళ్ల తరబడి ఎదురుచూపులు..

గత 60 ఏళ్లుగా సర్వేపల్లి కాలువ కట్టపై వేలాది మంది నిరుపేదలు నివాసముంటున్నారు. అయితే, ఆ స్థలాలకు వారికి చట్టబద్ధమైన హక్కులు లేవు. కాలువ పోరంబోకు భూమి కావడంతో, ఎప్పుడు తమ నివాసాలు ఖాళీ చేయిస్తారోనన్న భయంతోనే వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చినా, అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో అక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

### మంత్రి నారాయణ చొరవతో పరిష్కారం..

ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ, ఈ దీర్ఘకాలిక సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలువ కట్ట వాసుల ఇబ్బందులను, వారి ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల భగత్ సింగ్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించిన స్ఫూర్తితో, ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను కెనాల్ పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ ప్రక్రియలో కాలువ నిర్వహణ హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 1,215 కుటుంబాలకు అధికారికంగా ఇళ్ల పట్టాలు పొందేందుకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల కలను నిజం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కేబినెట్ నిర్ణయంతో సర్వేపల్లి కాలువ కట్ట వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి

తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత...

వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజక వర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నట్లు సంకేతాలిచ్చారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

# ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.

ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

### భారత స్థిరత్వం కీలకం

భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు.

### రక్షణ బంధం మరింత బలోపేతం

భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు.

### వరుస పర్యటనలతో బంధం బలోపేతం

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

### క్వాడ్‌పై అమెరికా ప్రత్యేక ఆసక్తి

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

### గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

### పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

### ఇక ఉపేక్షించేది లేదు..

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు.

ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఫుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం.. డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది.

భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరో-టాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్-ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం" అని ఆయన తెలిపారు. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది.

### ఏం జరిగింది?

వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ-2379) ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షలో పీఐసీకి "నాన్-నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కో-పైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

# కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ద్రవ్యోల్బణం, లిక్విడిటీ ఒత్తిడి.. రెపో రేటు పెంపునకు సిద్ధమవుతున్న ఆర్బీఐ?

- మొదటి పేజి తరువాయి

రూపాయి నిధుల వల్ల ఏర్పడిన అదనపు లిక్విడిటీ మరోవైపు.. ఈ రెండింటి మధ్య భారత ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్టర్లు సంక్లిష్టమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారని నివేదిక విశ్లేషించింది. ఈ అదనపు నగదు ప్రవాహం కారణంగా ఓవర్‌నైట్ వడ్డీ రేట్లు, ఆర్బీఐ పాలసీ రేటు కంటే చాలా తక్కువ స్థాయికి పడిపోయాయని తెలిపింది. ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి ఆర్బీఐ త్వరలోనే రంగంలోకి దిగాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఆర్బీఐ ఎంత వేగంగా చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఓవర్‌నైట్ రేట్లను తిరిగి పాలసీ రేట్లతో అనుసంధానించడం, మధ్యకాలికంగా ఉన్న అదనపు లిక్విడిటీని తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని రెపో రేటు పెంపుపై ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలు ఉంటాయని అంచనా వేసింది. ఎఫ్ఎక్స్ స్వాప్స్, ఎంఎస్ఎస్ బాండ్లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) అమ్మకాలు, అవసరమైతే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) పెంపు వంటి చర్యలను మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయని తెలిపింది. మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో ఇంధన ధరలు పెరగడం, వ్యవసాయ ఉత్పత్తులతో సహా ఇతర కమొడిటీల ధరల్లో ఒత్తిడి వంటి అంతర్జాతీయ అంశాలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయని నివేదిక గుర్తు చేసింది. దీనికి తోడు, దేశంలో రుతుపవనాలు అస్తవ్యస్తంగా ఉండటం, జీడీపీ వృద్ధి బలంగా నమోదు కావడం, రుణ వృద్ధి సుమారు 18 శాతంగా ఉండటం వంటి స్థానిక పరిస్థితులు కూడా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచుతున్నాయని వివరించింది. ఇప్పటివరకు వెలువడిన గణాంకాలు ఆర్బీఐకి కొంత ఊరటనిచ్చినప్పటికీ, ఇటీవలి ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశపు మినిట్స్.. సభ్యుల వైఖరి కఠినంగా మారుతోందనడానికి సంకేతమని నివేదిక అభిప్రాయపడింది. ప్రపంచవ్యాప్తంగా ధరల ఒత్తిళ్లు మరింత తీవ్రమవుతున్న తరుణంలో, ప్రస్తుత పాలసీ వైఖరిపై ఎంపీసీ సభ్యులలో అసౌకర్యం పెరుగుతోందని అంచనా వేసింది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** పాడేరు పట్టణంలోని శ్రీ శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, పాడేరు మాజీ శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నర్సింగరావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో, అత్యంత వైభవంగా కొనసాగాయి. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పలువురు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# జీకేవీధి జడ్పీటీసీ స్థానంపై వైసీపీలో ఆసక్తి

## టికెట్ కోసం పలువురు ఆశావహులు.. అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం జడ్పీటీసీ స్థానంపై వైసీపీలో పలువురు ఆశావహులు పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మాజీ వైసీపీ మండల అధ్యక్షుడు, ప్రస్తుత వైసీపీ పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, ప్రస్తుత ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ మండల అధ్యక్షుడు గిరిబాబు, ఉపాధ్యక్షుడు రేమల బాలకృష్ణ, దామనాపల్లి సర్పంచ్ నియోజకవర్గ వైసీపీ కోశాధికారి కుందేరి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ మచ్చల మత్స్యరాజు తదితరుల పేర్లు ఆశావహుల జాబితాలో వినిపిస్తున్నాయి. ప్రస్తుత జడ్పీటీసీ కిముడు శివరత్నం స్థానంలో పార్టీ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది. పార్టీ ఆదేశిస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పలువురు ఆశావహులు తమ అనుచరుల వద్ద పేర్కొంటున్నట్లు సమాచారం. వీరిలో బొబ్బిలి లక్ష్మణ్ చాలాకాలంగా వైసీపీకి కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇతర ఆశావహులు సైతం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేస్తున్న వారేనని చెబుతున్నారు. అయితే అధిష్ఠానం అనుభవం, స్థానిక పరిస్థితులు, సామాజిక సమీకరణాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిని ఖరారు చేస్తుందా.. లేక కొత్త అభ్యర్థికి అవకాశం కల్పిస్తుందా అన్నది వేచి చూడాల్సి ఉంది. గత జడ్పీటీసీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నాయని స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. కూటమి పార్టీల వైపు, ముఖ్యంగా జనసేన పార్టీ వైపు కొంతమంది గిరిజన యువత ఆసక్తి చూపుతున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ స్థానానికి బలమైన, ప్రజాదరణ కలిగిన అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన అవసరం ఉందని వైసీపీకి చెందిన కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారు. చివరికి ఆశావహుల్లో ఎవరికి వైసీపీ అధిష్ఠానం అవకాశం కల్పిస్తుందన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**గంజాయి జోలికి వెళ్లొద్దు : సీఐ సుధాకర్**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీకేవీధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ సూచించారు. గూడెంకొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ రామగడ్డలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ సేవలు విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల ఆశలు చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి అడిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, బ్యాంకు ఖాతా లేదా ఇతర వ్యక్తిగత వివరాలను వెల్లడించవద్దని సూచించారు.
అదేవిధంగా గంజాయి వంటి నిషేధిత పదార్థాల జోలికి వెళ్లవద్దని, వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని సీఐ కోరారు.

## పేరుకే పి.వీ.టీ.జి గ్రామంలు,అభివృద్ధిలో ఆమడ దూరం.

### కాటికి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్న పందుల వానివలస గ్రామ ప్రజలు.



**జియ్యమవలస ,సెప్టెంబర్ 04 పెన్ పవర్.** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత వెనుకబడిన గిరిజన తెగల పి.వీ.టీ.జి ల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించినప్పటికీ పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మ వలస మండలం పందులవానివలస పి.వీ.టీ.జి గ్రామం మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని గిరిజన సంఘం నాయకుడు చంద్రశేఖర్ అన్నాడు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, ఈ గ్రామంలో దశాబ్దాలు క్రితం నుండి 40 గదబ కుటుంబాలు నివాసం ఉంటుంటారు. ఆనాటి నుండి నేటి వరకు
రహదారి,త్రాగునీరు,విద్యుత్,వైద్య సేవలు,విద్య సౌకర్యాలు,రవాణా డ్రైనేజీ ఉపాధి అవకాశాలు అందక తీవ్ర ఇబ్బందుకు ఎదుర్కొంటున్నారని. కనీసం మరణించించిన వ్యక్తులకు స్మశానం తీసుకువెళ్ళడానికి దారి లేక ఇబ్బందులకు
గురౌతున్నారు. గ్రామంలో ఒక వ్యక్తి మరణించడంతో స్మశాన వాటికకు తీసుకు వెళ్లేందుకు నాన్న ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ పి.వీ.టీ.జి ప్రజలకు అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని పథకాలు కాగితాలకే పరిమితి కాకుండా ప్రతి పీ.వీ.టీ.జి కుటుంబానికి వాటి ప్రయోజనాలు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్ కోరుతున్నామారు..

## ఆల్కలైన్ అయనైజ్డ్ నీరు ఆరోగ్యానికి శుభప్రదం




మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విశాఖ , పెన్ పవర్, సెప్టెంబర్ 04 :** ఆల్కలైన్ అయనైజ్డ్ నీరు ఆరోగ్యానికి మేలు చేస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎం.ఎస్.ఎం.ఈ గ్రా మీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధా ల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విశాఖపట్నంలోని గాజువాక ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన అమృత ఆక్వా న్యాచురల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆల్కలైన్ అయనైజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన విధానంలో ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగు తోందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే విశాఖ కేంద్రంగా గాజువాక ఆటోనగర్‌లో జపనీస్ సాంకేతిక పరిజ్ఞానంతో ఆల్క లైన్ అయనైజ్డ్ తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అయితే, ఆల్కలైన్ నీరు క్యాన్సర్ వంటి వ్యాధులను నివారిస్తుందని నిర్ధారించే వైద్య ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి పేర్కొన్న వ్యాఖ్యలను వార్తా కథనంలో ఆరోగ్యపరమైన హామీగా పరిగణించరాదని తెలిపారు. నాణ్యమైన, శుద్ధి చేసిన తాగునీటిని తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.
యువత ఎంఎస్ఎంఈల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఉపాధి అవకాశాల కోసం యువత పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితిని తగ్గించే దిశగా కూ టమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కొత్తగా పరిశ్ర మలు స్థాపించాలనుకునే యువతకు మ్యానుఫ్యా క్చరింగ్, ప్యాకేజింగ్ రంగాలు మంచి అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సింగిల్ విండో విధానం ద్వారా యువత పరిశ్రమలు స్థాపించేందుకు ఎంఎస్ఎంఈ శాఖ అవసరమైన సహకారం అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, అమృత ఆక్వా న్యాచురల్స్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కృష్ణాష్టమి వేళ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 4:** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీవీఎంసీ పరిధిలో మాంసం చికెన్,జంతువద, అమ్మకాలు చేయరాదు అంటూ నిషేధం విధించిన నిషేధాజ్ఞలు ఆరిలోవలో బేఖాతరు అయ్యాయి.
శుక్రవారం (సెప్టెంబర్ 4) కృష్ణాష్టమి సందర్భంగా జీవీఎంసీ పరిధిలో మాంసం, చికెన్, చేపలు, జంతువుల వధ, విక్రయాలు నిషేధమని గురువారం కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పండుగ పవిత్రత దృష్ట్యా వ్యాపారులందరూ తప్పనిసరిగా దుకాణాలు మూసివేయాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ మేరకు ప్రజారోగ్య శాఖ, పశువైద్య విభాగం అధికారులు వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆరిలోవ ప్రాంతంలో పలు చోట్ల శుక్రవారం ఉదయం నుంచే చాటు మాటున మాంసం దుకాణాలు తెరిచిన కొందరు విక్రయాలు కొనసాగించారు.
ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం, క్షేత్రస్థాయిలో వ్యాపారులు పాటించకపోవడం, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం ఇక్కడ వారికి “మామూలే” అయిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిషేధాజ్ఞలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## ఇది సుధర్మ కంపెనీ యా వధర్మ కంపెనీ

- మీకు పట్టదా బాబోయ్ ఏమిటి ఈ ధూళి ఇబ్బందులు అంటూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిర్లక్ష్యపు ధోరణిలో హైవే అధికారులు తమ ఇబ్బందులు హైవే అధికారులకు పట్టవా అంటున్నారు.





**జి.మాడుగుల పెన్ పవర్ సెప్టెంబర్ (4)** బాబోయ్ ఏమిటి దూళి లొ ప్రయాణం చేసేది ఎలా అంటూ సంతబయలు నుంచి జి మాడుగుల వరకు ప్రయాణం చేస్తున్నా ద్విచక్ర వాహన చోధకులతోపాటు సంతబయలు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి ఈ 516వ నిర్మాణం జరుగుతున్న జి.మాడుగుల పోలీస్ స్టేషన్ నుంచి సంత బయలు వరకు రోడ్డుమీద చిప్స్ వేసి వదిలేశారు. ఎండలు కాస్తూ ఉండడంతో వాహనాలు ప్రయాణం సాగిస్తున్న తరుణంలో రోడ్డుమీద దూళి ఎగిసిపడి ముందు వెళ్లే వాహనంతో పాటు ఎనకాల వెళ్లే ద్విచక్ర. కార్లు జీపులు వాహనాల చోధకులు కళ్ళల్లో ధూళి పడి ప్రమాదాలకు గురవుతున్నారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి సంత బయలు గ్రామములో నివసిస్తున్న గ్రామ వాసులు పరిస్థితి మరి దారుణం వారు ఇళ్లల్లో ఉన్న పిల్లల్లోకి మరీ వెళ్లి ధూళి ఇబ్బంది పెడుతుంది వెల్లరించి బయటికి రాడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూళి వలన వ్యాధులు సోకే( కళ్ళకు ఊపిరితిత్తులకు) ప్రమాదం ఉందని కానీ హైవే అధికారులకు ఏమి పట్టలేదని గ్రామస్తులతోపాటు ఈ మార్గంలో పయనించే వాహన చో ధకులు నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్న రోడ్డును నీటితో తడపకుండా నిర్లక్ష్యంగా వదిలేయడం హైవే అధికారులకు తగునా అంటూ వాహన చో ధకులు ప్రజలు నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా హైవే అధికారులు గుత్తేదారు స్పందించి నీటితో తడిపి వాహన చో ధకులు ప్రజలు ఇబ్బందులు తొలగించాలని వారు కోరుతున్నారు. మరి హైవే అధికారులు గుత్తేదారి నుంచి ఎటువంటి స్పందన వస్తుందో వేచి చూడాలి .

## విబిజి రాంజీ పథకంలో రైతులకు సిల్వర్ మొక్కల పంపిణీ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సిగినాపల్లి గ్రామంలో విబిజి రాంజీ పథకంలో భాగంగా రైతులకు సిల్వర్ మొక్కలను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, పీసా గ్రామసభ కమిటీ సభ్యులు సాగిన రాధాకృష్ణ, రామ్మూర్తి రైతులకు మొక్కలను అందజేశారు.ప్రభుత్వం రైతుల అభివృద్ధి, ఆదాయ వనరుల పెంపుదల లక్ష్యంగా అందిస్తున్న మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని వారు రైతులకు సూచించారు. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీ సత్తిబాబు, గ్రామ పెద్దలు సాగిన లక్ష్మణరావు, రామారావు, లక్ష్మణరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి పై అవగాహన కనిపిస్తున్న. గీతారాణి.



**గుమ్మలక్ష్మీపురం సెప్టెంబర్. 04 పెన్ పవర్** మండలంలో లోవ ముఠా ప్రాంతం గొరడ గ్రామంలో శుక్రవారం సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.వై.డి.ఓ నెట్‌వర్క్ ఔట్‌రీచ్ వర్కర్ ఏ.గీతారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్థులకు హెచ్ఐవీ,ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గీతారాణి మాట్లాడుతూ,హెచ్ఐవీ,ఎయిడ్స్ వ్యాధులపై ప్రజలు అపోహలు వీడి,వ్యాధి నివారణకు అవసరమైన జాగ్రత్తలను పాటించాలని సూచించారు.వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు.హెచ్ఐవీపై సరైన అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు.అనుమానిత లక్షణాలు లేదా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించి వైద్యుల సూచన మేరకు పరీక్షలు,చికిత్స చేయించుకోవాలని సూచించారు.హెచ్ఐవీ,ఎయిడ్స్ వ్యాధిని అరికట్టాలంటే నివారణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు.ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు వ్యాధి పట్ల భయాందోళనలు,అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# కాంగ్రెస్ వారిని చేర్చుకుని వైసీపీ నుంచి వచ్చారనడం సిగ్గుచేటు



**కూటమి నాయకుల తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాం**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని, గతంలో ఇండిపెండెంట్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చిన వారిని టీడీపీలో చేర్చుకుని వారు వైసీపీ నుంచి చేరారని కూటమి నాయకులు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని వైసీపీ గూడెంకొత్తవీధి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ ఎంపీపీ బోయిన కుమారి విమర్శించారు.వారు మాట్లాడుతూ.. గురువారం ధారకొండ ప్రాంతంలో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమానికి వెళ్లిన కూటమి నాయకులు గిడ్డి ఈశ్వరి, మొట్టడం ప్రసాద్, రమేష్ నాయుడు, సుబ్బారావు తదితరులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని, గతంలో ఇండిపెండెంట్ గుర్తు పనసకాయకు ఓటు వేసిన వారిని టీడీపీలో చేర్చుకుని, వారంతా వైసీపీ నుంచి వచ్చినట్లు పత్రికా ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముందుగా అమలు చేసి గ్రామాల్లో అడుగుపెట్టాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు. 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతి, కొత్త పెన్షన్లు, కొత్త ఇళ్లు తదితర హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి కూటమి పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసే లక్ష్యంతో ప్రతి వైసీపీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, మాజీ సర్పంచ్ ముర్ల కమలమ్మ, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, నాయకులు వెంకటరమణ, బొంజిబాబు, మహదేవ్, చిట్టిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం శ్రీవారి ఆలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



**300 మంది మహిళా భక్తులతో సామూహిక వరలక్ష్మీ వ్రతం**

**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 4) :** శ్రావణ శుక్రవారం సందర్భంగా నర్సీపట్నంలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాల్లో సామాన్య భక్తులు సైతం భాగస్వాములు కావాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 300 మంది మహిళా భక్తులతో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వ్రతానికి అవసరమైన పూజా సామగ్రిని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చారు. మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా వ్రతంలో పాల్గొని, అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ అర్చకులు నేతేటి శరత్‌కుమార్ అర్చక పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మహిళా భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మహిళా భక్తులు కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని లక్ష్మీదేవిని ప్రార్థించారు. ఈ కార్యక్రమాన్ని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ కోఆర్డినేటర్ జి.వి.ఆర్.కె. ప్రసాద్ (రాంబాబు) పర్యవేక్షణలో జిల్లా సభ్యుడు కట్టమూరు శేఖర్, నర్సీపట్నం గ్రూప్ టెంపుల్స్ ఈఓ టి. సాంబశివరావు సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన శ్రీవారి సేవ సభ్యులకు, ఆలయ సిబ్బందికి, పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ జి.వి.ఆర్.కె. ప్రసాద్ (రాంబాబు) తెలిపారు.

## ఘనంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలు



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 04) :**నర్సీపట్నంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్పీకర్ నివాసంలో ఉదయం ఉదయం 7 గంటల నుంచే అభిమానులు, అధికారులు, శాసనసభ్యులు కేఎస్ఎన్ రాజుగారు, విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, టిడిపి నాయకులు పీల గోవిందు, తాతయ్య బాబు, టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడు, అనకాపల్లి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి లాలం శ్రీరంగస్వామి తరలివచ్చి స్పీకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం అయింది.

మీడియాతో మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన పుట్టినరోజు సందర్భంగా నర్సీపట్నంలో మెగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ విశాఖపట్నం, నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్, అలాగే ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ వారు శిబిరాలను ఏర్పాటు చేశారని తెలిపారు. అదేవిధంగా బొడ్డేపల్లి మార్కెట్ యార్డు వద్ద రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారు కూడా శిబిరం ఏర్పాటు చేసినట్టు వివరించారు.

తన పుట్టినరోజు ముఖ్యమేమీ కాదని, రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రతి సంవత్సరం పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ ఏడాది స్పందన మరింతగా లభించిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆనందం వ్యక్తం చేశారు.

## విజ్ఞాన్స్ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కూర్మన్న పాలెం:పెన్ పవర్ ,సెప్టెంబర్ 4** విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలు, ఉత్సాహం మరియు సాంస్కృతిక వైభవంతో ఘనంగా నిర్వహించారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు విలువల గొప్పతనాన్ని ప్రతిబింబించాయి. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను భక్తి, ఆనందోత్సాహాలతో నింపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను చాటిచెప్పాయి. విద్యార్థులు భారతీయ సంప్రదాయాలను తెలుసుకోవడంతో పాటు వాటి పట్ల అవగాహన పెంపొందించుకునేందుకు , విద్యార్థుల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యం మరియు సమైక్యతా భావాన్ని పెంపొందించాయి. ఈ కార్యక్రమానికి డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్, డా. వి. మధుసూదన రావు, రెక్టర్, డా. చ. హరి గోవింద రావు, డీన్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, శివరామకృష్ణ, డీన్ -- స్టూడెంట్ అఫైర్స్, డా. హెచ్. దేవన్న, హెడ్ -- ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం హాజరై వేడుకలను తిలకించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో వేడుకలు భక్తి, సంతోషాల మధ్య ఘనంగా ముగిశాయి. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు వారసత్వంపై అవగాహనను పెంపొందించడంలో ఈ వేడుకలు ప్రత్యేకంగా నిలిచాయి.

## 25 మంది రైతులకు రూ.15.25 లక్షల రుణాలు పంపిణీ


- సహకార సంఘాల ద్వారా ఆర్థిక ఆసరా
- పీఏసీఎస్ చైర్మన్ మొట్టడం నూకరాజు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు అందించి ఆర్థికంగా ఆసరా కల్పిస్తున్నామని గూడెంకొత్తవీధి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ మొట్టడం నూకరాజు అన్నారు.స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావుతో కలిసి 25 మంది రైతులకు మొత్తం రూ.15.25 లక్షల కొత్త రుణాలను పంపిణీ చేశారు. రైతులు ప్రభుత్వం, సహకార సంఘాల ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సహకార రంగం రైతుల అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తోందని, అర్హులైన రైతులకు సకాలంలో రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సూపర్వైజర్ సురేశ్, పీఏసీఎస్ సీఈవో వి. చిన్నబ్బాయి, కూటమి నాయకులు, టీడీపీ నాయకుడు గోవింద్, సహకార సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు బీజేపీ సన్నద్ధం

**కూటమితో సమిష్టిగా పనిచేయాలి : జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాకురు శేఖర్ ఆధ్వర్యంలో మండల పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, మండల ఇన్‌చార్జి కదుళ్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పుట్ట గంగయ్య మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కూటమి పార్టీలతో కలిసి పనిచేసి విజయానికి కృషి చేయాలని కోరారు. మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ నాయకుడు, కార్యకర్తపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, జీకేవీధి ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి చల్లంగి అచ్యుత్, నాయకులు గడుతూరి రాజ్‌కోటి, కిముడు ముంది, కొర్ర భాస్కరరావు, బి. చిరంజీవి, ఎం. రామ్‌కిరణ్ కుమార్ రాజు, జి. త్రినాథ్, ఎం. లక్ష్మణ్, లకే రాము, లకే ప్రసాద్, తగ్గి వీరభద్రం, సదరం మారిబాబు, కారే అప్పలరాజు, సత్తిబాబు, కే. సన్యాసిరావు, కే. రఘు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యన్నపాత్రుడికి వెలమ సంక్షేమ సంఘం శుభాకాంక్షలు

**గాజువాక:పెన్ పవర్ ,సెప్టెంబర్ 04** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్,సీనియర్ తెదేపా నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు పుట్టినరోజు సందర్భంగా గాజువాక వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు నర్సీపట్నంలోని ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు 65 వ వార్డు మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అయ్యన్నపాత్రుడు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజల పక్షాన నిలిచి, నర్సీపట్నం నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు. శాసనసభ స్పీకర్‌గా సభా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు చేస్తున్న కృషిని వారు అభినందించారు.అయ్యన్నపాత్రుడు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి రాష్ట్రానికి సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గాజువాక వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెన్నెల ఈశ్వరరావు,వాసిరెడ్డి విజయ్ కుమార్,కొల్లి ఈశ్వరరావు పలువురు సభ్యులు పాల్గొన్నారు.




02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

## ఆంగ్ల భాష( ఇంగ్లీష్) పై ప్రతి ఒక్క విద్యార్థి పట్టు సాధించాలి.

- ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఇంగ్లీష్ పై అవగాహన అత్యంత ఆవశ్యకం.
- చింతపల్లి సీఐ బి. సింహాచలం.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 4.** ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఆంగ్ల ( ఇంగ్లీష్) భాష పై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి, ఆ భాష పై పట్టు సాధించాలని చింతపల్లి సిఐ బి. సింహాచలం అన్నారు. శుక్రవారం మండలంలోని లోతు గడ్డ గిరిజనప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 8,9,10వ. తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం ఇంగ్లీష్ భాషకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. మాతృభాష అయినా తెలుగులో చదువుకుంటున్నప్పటికీ, తెలుగు భాషను గౌరవిస్తూనే ఇంగ్లీషు పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఇంగ్లీషులో చదవడం, రాయడం, మాట్లాడడం వంటి వాటిలో ప్రావీణ్యతను సంపాదించుకోవాలన్నారు. ఎటువంటి పోటీ పరీక్షల కైనా ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షల నిర్వహణ జరుగుతుంది అన్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లీషులో మంచి విషయ పరిజ్ఞానం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. ఆ దిశగా విద్యార్థులు ఇంగ్లీష్ భాష పై పట్టు సాధించేందుకు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్సై సాయిరాం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చింతపల్లిలో ఘనంగా శ్రీ సత్యసాయి బాబా రధ యాత్ర.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 4:**అల్లూరి జిల్లా, చింతపల్లి మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి బాబారధ యాత్ర అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. స్థానిక సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో ఈ యాత్రను నిర్వహించారు.

ఈ సందర్భంగా భక్తులు బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు, సంకీర్తనలు చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా యాత్ర సాగింది.

మానవ సేవే మాధవ సేవ అని చాటిన మహనీయులు శ్రీ సత్యసాయి బాబా. ప్రేమ, సేవ, త్యాగం, సత్యం, ధర్మం అనే పంచ సూత్రాలను ప్రజలకు బోధించారు. విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం వంటి ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా కోట్లాది మంది హృదయాల్లో దైవంగా నిలిచారని భక్తులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన పాఠశాలల్లో బాలికలకు భద్రత కల్పించాలి.



- ప్రతి పాఠశాలలో వైద్య సిబ్బందిని నియమించాలి.
- పాఠశాలల విద్యార్థినుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి
- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
- ఐటీడీఏ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించాలి.
- విద్యార్థినిలు గర్భం దాల్చడం,అనారోగ్య మరణాలు లేకుండా చూడాలని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పార్వతీపురం సెప్టెంబర్ 04 పెన్ పవర్.**పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు,వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినులకు భద్రత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.శుక్రవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, పత్రి పత్రిక విలేకరులతో అన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ,జిల్లాలోని ముఖ్యంగా గిరిజన పాఠశాలలు/ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు గర్భం దాల్చిన సంఘటనలు చోటు చేసుకుంటుండటం బాధాకరమన్నారు.ఇటీవల గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఓ కళాశాలలో వెలుగు చూసిన సంఘటనతో పాటు గతంలో ఇటువంటి పలు సంఘటనలు జరిగిన తీరు చూస్తుంటే విద్యాశాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు.ఆయా పాఠశాలలు,కళాశాలలో వైద్య సిబ్బందిని తప్పనిసరిగా నియమించాలన్నారు.క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.విద్యార్థులకు అవగాహన తరగతులునిర్వహించాలన్నారు.ఇటువంటి పరిస్థితుల వలన బాధిత విద్యార్థినులు చదువుకి దూరమై జీవితాన్ని కోల్పోయే పరిస్థితులునెలకొంటున్నాయన్నారు.ఇటువంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే జిల్లాలో అనారోగ్యంతోవిద్యార్థులు మృత్యువాత పడకుండా చర్యలు చేపట్టాలని.జిల్లాలో ఇప్పటికే అనారోగ్యంతో విద్యార్థులు మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు.మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు.రక్తహీనతకు లోను కాకుండా చూడాలన్నారు.తమ పిల్లలు ప్రయోజకులవుతారని ఆశ తో పిల్లలను పాఠశాల,కళాశాలలకు తల్లిదండ్రులు పంపిస్తే వారి ఆశలు నిరాశ అవుతున్నాయన్నారు.తరచూ చోటు చేసుకుంటున్నా ఇటువంటి సంఘటనల మూలాలు వెతికి ఇకపై జరక్కుండా చూడాలన్నారు.విద్యార్థినుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు.వారి ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పాలకులు,ఉన్నతాధికారులు స్పందించి గత ఆరేళ్లుగా జరగని ఐటిడిఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.పాఠశాలలు,కళాశాలలో చదువుతున్న విద్యార్థులు గర్భం దాల్చడంతో పాటు విద్యార్థులుఅనారోగ్యంతో మృతి చెందడం తదితర సంఘటనలు భవిష్యత్తులో చోటు చేసుకోకుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## సకల దేవతల ఆలయ ప్రాంగణంలో శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు.

**రామాలయం వీధిలో ఘనంగా ప్రత్యేక కార్యక్రమాలు.**

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 4.** మండల కేంద్రం లోని రామాలయం వీధిలో గల సకల దేవతల ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోకాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో నడిచిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా సాగింది. భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యం కలగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. చిన్నికృష్ణులతో ( చిన్నారులతో) ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందర్నీ ఆకట్టుకుంది. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు. ఉట్టి కొట్టే పోటీలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని విజయ్ కుమార్, రెండవ బహుమతిని పెదపూడి కార్తికేయ గెలుచుకున్నారు. పోటీలలో గెలుపొందిన చిన్నారులను ఆలయ నిర్వాహకులు పెద్దలు అభినందిస్తూ ఆశీర్వచనాలు అందించారు. చిన్నారుల ఆటపాటలతో, భక్తుల సందడితో సకల దేవతల ఆలయ ప్రాంగణం కృష్ణాష్టమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభనం సంతరించుకుంది.



## విజ్ఞాన భారతి పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి సంబరాలు.



- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు, ఉట్టికొట్టే కార్యక్రమం.
- వేడుకల్లో పాల్గొన్న తహశీల్దార్ త్రివేణి హనుమంతు.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 4.** చింతపల్లిలోని స్థానిక విజ్ఞాన భారతి (బి.వి.కె) పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల ప్రధానాచార్యులు పి.వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ సంబరాలు ఆద్యంతం పండుగ వాతావరణాన్ని తలపించాయి. ముద్దులొలికే చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణల్లో వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయబద్ధంగా ఉత్సాహభరితంగా సాగిన 'ఉట్టి కొట్టే' ఘట్టం చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల తహశీల్దార్ హనుమంతు త్రివేణి పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు బాల్య దశ నుంచే మన పండుగల విశిష్టతను, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకోవాలని సూచించారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా విలువలతో కూడిన విద్యను అందిపుచ్చుకుని, భవిష్యత్తులో తమ ఉపాధ్యాయుల కన్నా, అధికారుల కన్నా అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ?అనంతరం పాఠశాల ప్రధానాచార్యులు వెంకటేష్ మాట్లాడుతూ,చదువుతో పాటుగా విద్యార్థులలో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడమే తమ ప్రధాన ఉద్దేశమని, అందుకు అనుగుణంగానే విద్యాబోధన సాగుతోందని స్పష్టం చేశారు. తమ పిల్లలను శ్రీకృష్ణుడు, గోపికలుగా ముస్తాబు చేసి పంపిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పండుగ సంబరాల్లో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గత్తుమలడలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- వైసిపి నేత కూడ దాసు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 04.** మండలంలోని పెదగూడ పంచాయతీ గత్తుమలడ గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు వైసిపి నేత కూడ దాసు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మండల పరిధిలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. గ్రామానికి చెందిన ఆలయ పూజారి కూడ మత్స్యరాజు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా ఏర్పాటు చేశామన్నారు. కృష్ణాష్టమి పండుగ వేడుకలో ఆంధ్ర ఒడిస్సా ప్రాంత భక్తులు అనేకమంది పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారనీ అన్నారు. అదేవిధంగా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో చిన్నారి సాత్విక్ శ్రీకృష్ణుడు వేషధారణలో అందరిని ఆకర్షించాడు. మండల కేంద్రానికి చెందిన వ్యాపారి గుడ్ల వెంకటరావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయం ఎదుట ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గణపతి, నాని బాబు, శ్రీనివాసమూర్తి, రవి, ప్రసాద్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 87వవార్డు పార్టీ కార్యాలయం నందు సమావేశం.



**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,సెప్టెంబర్ 04**

మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధిలో వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు వార్డు అధ్యక్షుడు సాగి సన్యాసి విజయరామరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో వారు అందించిన సంక్షేమాలు, చేసిన అభివృద్ధి ప్రతీ నాయకుడు,కార్యకర్త తన వంతు బాధ్యతగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలనీ . ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో గాజువాక నియోజకవర్గాన్ని నిలబెడతారని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీ బొట్టా ప్రకాష్, క్లస్టర్ ఇంచార్జ్ సూరిశెట్టి పెంటరావు, బీజేపీ జిల్లా నాయకులు లక్కరాజు సోమరాజు,పి. పెంటయ్య, కె. శ్రీనివాసనాయుడు, బి. పైడిరాజు, కె. ఈశ్వరరావు, ద్రోణాద్రి అప్పలనాయుడు ,గెద్దాడ రాంబాబు, కె. కనక సత్యం, ఆనంద్ కుమార్,మల్లా రాము వై. భాస్కర్ రావు,,దుగ్గపు రాజేంద్ర ప్రసాద్,పోతల కృష్ణ, కడుపుట్ల శ్రీను,గండేపల్లి రాము,జాన్ రమేష్,అప్పలనాయుడు , కె. కళ్యాణ్ చెక్రవర్తి,బొడ్డా ప్రకాష్, శిరసపల్లి అప్పలరాజు,ప్రగడ శ్రీను,సూరిబాబు ,శ్రీరామ్మూర్తి,దాల్లయ్య, ఎటిఎన్ మూర్తి,ఈ. దేముడు,వై. నాగేశ్వరరావు,కామేశ్వరరావు,రహీమ్, అలీ, ఎస్. అప్పారావు, సంద్రాన అప్పారావు, సంద్రాన సూరిబాబు, సన్యాసిరావు ,బొండా నాగరాజు,మింది రాజు ,గణేష్,తిరుమల నగర్ అసోసియేషన్, సిద్ధార్థ నగర్ అసోసియేషన్, గణేష్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు పాలుగొన్నారు.

# స్థానిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా సహకరించాలి

కాట్రగడ్డ గ్రామస్తులకు ఎస్ఐ యాసిన్ అవగాహన




**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీలేరు ఎస్ఐ ఎండి. యాసిన్ కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కాట్రగడ్డ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు ఎన్నికలు, సైబర్ మోసాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఒకరిపై ఒకరు రెచ్చగొట్టుకునే విధంగా వ్యవహరించకూడదని సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు, వివాదాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. గంజాయి సాగు, అక్రమ రవాణాకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్తులంతా ఐకమత్యంతో ఉంటూ ప్రశాంత వాతావరణాన్ని కాపాడుకోవాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కాట్రగడ్డ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలో తప్పులు సవరించుకోండి

- ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి.
- వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 04.** మండలంలో గల జర్జుల పంచాయతీ కేంద్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓటరు జాబితా పై సవరణ కొరకు గ్రామ సభ నిర్వహించినట్లు వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కులాలకు సంబంధించిన వివరాల్లో తప్పులు, అభ్యంతరాలు ఉంటే నిర్దేశిత ప్రక్రియ ద్వారా తెలియజేసి సరిచేసుకోవాలని సూచించారు. జర్జుల పంచాయతీలో ఎస్టీ గిరిజనులు మినహా ఇతర కులాల వారు లేరనే అంశంపై గ్రామసభలో చర్చించి, సంబంధిత అధికారులు సమక్షంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. అలాగే త్వరలో జరగనున్న పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రజలు సంసిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, గ్రామ సమస్యల పరిష్కారానికి సేవ చేసే వ్యక్తులను మాత్రమే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్జుల ఎంపీటీసీ వి. విజయలక్ష్మి, పంచాయతీ బూత్ కమిటీ సభ్యులు, పంచాయతీ అధ్యక్షులు మోనేశ్వరరావు, సాధురం, కృష్ణారావు, లోకినాథ్, ఆనంద్‌రావు పడాల్, నారాయణ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుగా ఏడుగురి ఎంపిక

- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాడేరులో అవార్డుల ప్రదానం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 5:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం నుంచి ఏడుగురు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. శుక్రవారం పాడేరులో నిర్వహించే కార్యక్రమంలో వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, సన్మానం అందజేయనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా కే. సుమిత్రా, ఎం. స్వరూపారాణి, డి. సీమ, పి. రామకృష్ణ, డి.వి. కాలేశ్వరరావు, వి. భగీరధి, జి. కామేశ్వరరావు ఎంపికయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, బోధనా రంగంలో అందిస్తున్న సేవలను గుర్తించి వీరిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకోనున్న ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు.

# వలస గిరిజనేతరుల జనగణనపై ఎన్‌సీఎస్టీ స్పందన

- ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ లేఖ



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** ఆంధ్రప్రదేశ్‌లోని 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో వలస వచ్చిన గిరిజనేతరులను జనగణన--2027లో ఆయా ప్రాంతాలకు చెందినవారిగా నమోదు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు సమర్పించిన వినతిపత్రంపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్టీ) స్పందించినట్లు వారు తెలిపారు. దండకారణ్య విమోచన సమితి నాయకులు 03-06-2026న సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన ఎన్‌సీఎస్టీ, 04-08-2026న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అధికారికంగా లేఖ పంపినట్లు పేర్కొన్నారు. డైరెక్టర్ డా. పి. కళ్యాణ్‌రెడ్డి సంతకంతో జారీ అయిన లేఖలో దండకారణ్య విమోచన సమితి సమర్పించిన పిటిషన్ ప్రతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపుతూ, ఈ అంశంపై తీసుకున్న లేదా తీసుకోబోయే చర్యలను పిటిషనర్‌కు నేరుగా తెలియజేయాలని, అలాగే కమిషన్‌కు కూడా సమాచారం అందించాలని కోరినట్లు తెలిపారు. జీవో నెం.3 రద్దు వ్యవహారంలో సుప్రీంకోర్టు ప్రస్తావించిన అంశాల్లో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరుల జనాభా కూడా ఒకటని దండకారణ్య విమోచన సమితి నాయకులు పేర్కొన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం వలస వచ్చిన గిరిజనేతరులను జనగణన--2027లో నమోదు చేస్తే, వారు ఆయా ప్రాంతాలకు చెందినవారిగా అధికారికంగా గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని, దీని వల్ల ఆదివాసీల రాజ్యాంగ హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 5వ షెడ్యూల్ ప్రాంతాలు రాజ్యాంగపరంగా ప్రత్యేక రక్షణ పొందుతున్న ప్రాంతాలని, అక్కడి గిరిజనుల భూమి, సంస్కృతి, సంప్రదాయాలు, స్వయంపాలన, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని నాయకులు పేర్కొన్నారు. వలస వచ్చిన గిరిజనేతరుల వివరాలు జనగణనలో నమోదైతే భవిష్యత్తులో షెడ్యూల్డ్ ఏరియాల జనాభా గణాంకాలు, సంక్షేమ పథకాలు, హక్కులు, పరిపాలనా నిర్ణయాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జనగణన--2027కు ముందే 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసపై సమగ్ర పరిశీలన చేపట్టి, రాజ్యాంగం, అమలులో ఉన్న చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ స్పందించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడం గిరిజనుల హక్కుల పరిరక్షణలో కీలక పరిణామమని దండకారణ్య విమోచన సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్రా మార్క్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కిల్లో మనోజ్‌కుమార్, డీఎల్ఓ సభ్యులు మంగరాజు, బొజ్జయ్య, కృష్ణ, కామేష్, జగ్గారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోర్టు సామర్థ్యానికి మరో బలం..




60 టన్నుల టగ్ నిర్మాణం షురూ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 04 :** విశాఖపట్నం పోర్ట్ అథారిటీ వీపీఏ కోసం నిర్మిస్తున్న రెండో 60 టన్నుల బొల్లార్డ్ పుల్ టగ్ వి సి 11206 నిర్మాణంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ హెచ్‌ఎస్ఎల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ టగ్‌కు శుక్రవారం కీల్ లేయింగ్ కార్యక్రమం నిర్వహించారు. వీపీఏ చైర్‌పర్సన్ జస్మీత్ సింగ్ బింద్రా, ఐఆర్‌టీఎస్ ముఖ్య అతిథిగా హాజరై కీల్ లేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీపీఏ, హెచ్‌ఎస్ఎల్, ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ ఐ.ఆ ర్.ఎస్, సోలాస్ మెరైన్ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2025 డిసెంబర్‌లో ఒప్పందం కుదిరిన ఈ టగ్‌ను ఐఆర్ఎస్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తున్నారు. ఇదే ప్రాజెక్టులోని తొలి టగ్ ఇప్పటికే 60 శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. రెండు టగ్‌లు ఈ ఏడాది అక్టోబర్‌లో ఏకకాలంలో నీటిలోకి దింపేందుకు హెచ్‌ఎస్ఎల్ సన్నాహాలు చేస్తోంది. వీపీఏ చైర్‌పర్సన్ జస్మీత్ సింగ్ బింద్రా మాట్లాడు తూ, ఈ రెండు టగ్‌లు పోర్టు కార్యకలాపాలకు వ్యూహాత్మ కంగా కీలకమైనవని అన్నారు. నౌకల సురక్షిత బెర్తింగ్‌కు ఇవి దోహదపడటంతో పాటు పోర్టులో నౌకల టర్న్‌అరౌండ్ సమ యాన్ని తగ్గిస్తాయని తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా హెచ్‌ఎస్ఎల్ పున రుత్తేజంతో ముందుకు సాగుతోందని ప్రశంసించారు. విశాఖప ట్నానికి చెందిన రెండు వారసత్వ సంస్థలైన వీపీఏ, హెచ్ఎస్ ఎల్ తొమ్మిది దశాబ్దాలకు పైగా దేశ సేవలో భాగస్వాములుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరిలో స్టీల్ కటింగ్ నుంచి కీల్ లేయింగ్ వరకు నిర్దేశిత కాలపట్టిక ప్రకారం పను లు కొనసాగిస్తున్న హెచ్‌ఎస్ఎల్‌ను అభినందించారు. హెచ్. ఎస్.ఎల్ సీఎండీ రియర్ అడ్మిరల్ చంద్రశేఖరన్ రఘురామ్, వీఎస్ఎం (రిటైర్డ్) మాట్లాడుతూ, వీపీఏ, ఐఆర్ఎస్, హెచ్ఎ స్ఎల్ అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నౌకల నిర్మాణాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయడమే హెచ్ఎస్ ఎల్ లక్ష్యమని స్పష్టం చేశారు. వీపీఏతో హెచ్‌ఎస్ఎల్ భవిష్యత్‌లో మరింత విస్తృత భాగస్వామ్యానికి సిద్ధమవు తోందని ఆయన తెలిపారు. ఇందులో 60 టన్నుల సామ ర్థ్యంతో కూడిన ఎలక్ట్రిక్ టగ్ నిర్మాణ ప్రతిపాదన, గ్రీన్ ఫ్లీట్ మార్పిడి, హెచ్‌ఎస్ఎల్ డ్రైడాక్‌ను వినియోగిస్తూ దీర్ఘకాలిక షిప్ రిపేర్ భాగస్వామ్యం, దుగరాజపట్నంలో భవిష్యత్ షిప్‌బిల్డింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయని వెల్లడించారు. 'ఒకే షిప్‌యార్డ్.. ఒకే లక్ష్యం.. భారత సముద్ర భవిష్యత్తుకు బలమైన పునాది' అనే నినాదంతో హెచ్‌ఎస్ఎల్ ముందుకు సాగుతోందని రఘురామ్ పేర్కొ న్నారు. హెచ్‌ఎస్ఎల్--వీపీఏ భాగస్వామ్యం కేవలం టగ్‌ల నిర్మాణానికే పరిమితం కాకుండా 'ఆత్మనిర్భర్ భారత్', 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలకు అనుగుణంగా విస్తరిస్తోం దని అధికారులు తెలిపారు. ఈ భాగస్వామ్యంతో విశాఖప ట్నం దేశంలోని కీలక నౌకా నిర్మాణ, సముద్ర వాణిజ్య కేంద్రా ల్లో ఒకటిగా మరింత అభివృద్ధి చెందే అవకాశముందని పేర్కొన్నారు.

వీపీఏకు హెచ్‌ఎస్ఎల్ 13వ నౌక

1970లో 'లాంచ్ శాంతి' నౌక నుంచి ప్రారంభమైన హెచ్‌ఎస్ఎల్--వీపీఏ భాగస్వామ్యంలో ఇప్పటివరకు వీపీఏ కోసం నిర్మించిన నౌకల సంఖ్య 13కు చేరింది.


## ఎర్ని దుర్గానగర్ లో ఘనంగా వినాయక చవితి రాట మహోత్సవం

పూజా కార్యక్రమంలో పాల్గొన్న 13వ వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,శ్రీమహాలక్ష్మి దంపతులు



**విశాఖ తూర్పు,పెన్ పవర్ సెప్టెంబర్ 4::** జీవీఎంసీ 13వ వార్డు పరిధి సెక్టార్-4, ఎన్ని దుర్గానర్ రామాలయం వీధిలో వినాయక చవితి పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు.
రామాలయ వ్యవస్థాపక చైర్మన్ పి.ఐ. బాలరాజు, స్థానిక ప్రజల ఆధ్వర్యంలో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, అందరికీ మహోత్సవాన్ని వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,శ్రీ మహాలక్ష్మి దంపతులు, పూజా కార్యక్రమంలో పాల్గొని పందిరి రాట పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు చింతలపూడి,అప్పలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు, పూజా కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను చేపట్టారు.
కార్యక్రమంలో గెడ్డం లక్ష్మి, భాను, భవాని గెడ్డం గంగరాజు, సీతామహాలక్ష్మి, కుమారి, ఇమంది కనక,చిమ్మిటి కిరణ్, చింతలపూడి నాగేశ్వరరావు,కృష్ణ, పిల్లి రమణమ్మ,లక్ష్మి, కాంతారావు,గోవింద్, యాంద్ర అప్పారావు, రాజ్ కుమార్,స్థానిక మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం



**కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.**

**గుమ్మలక్ష్మీపురం. సెప్టెంబర్ 04 పెన్ పవర్.** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు,ఉపాధ్యాయినులందరికీ ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి. శుభాకాంక్షలు, నమస్కారాలు తెలిపారు. ప్రతి ఏడాది ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలకు హాజరై ఉపాధ్యాయులతో కలిసి ఉండే తనకు,ఈ ఏడాది ఉండవల్లిలో ముఖ్యమంత్రి సమక్షంలో నిర్వహించనున్న విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కారణంగా విజయవాడలో ఉండాల్సి వచ్చిందని తెలిపారు. తన పరిస్థితిని ఉపాధ్యాయులందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యా వ్యవస్థ భావితరాలకు మంచి భవిష్యత్తును అందించడంతో పాటు సమగ్ర అభివృద్ధికి కీలకంగా దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేసి,కురుపాం నియోజకవర్గంతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## దోడిపుట్టులో ఓటరు జాబితాను గ్రామసభ ఆమోదం

- సెప్టెంబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల
- ముంచంగిపుట్టు మండల తెలుగు రైతు అధ్యక్షుడు కిముడు ఉర్లోబ్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 04.** ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికల ముందస్తు ప్రక్రియలో భాగంగా మండలంలోని దోడిపుట్టు పంచాయతీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి బి రమేష్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితా ఆమోదం కొరకు గ్రామసభ నిర్వహించినట్లు మండల టిడిపి తెలుగు రైతు అధ్యక్షుడు కిముడు ఉర్లోబ్ తెలిపారు. ఈ సందర్భంగా శు క్రవారం ఆయన మాట్లాడుతూ.. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీల వారిగా ఎస్సీ, ఎస్టీ, బిసి ఓటర్ల గుర్తింపు, సవరణ ప్రక్రియలో భాగంగా గ్రామసభ నిర్వహించారన్నారు. గ్రామసభలో పంచాయతీ పరిధిలో అందరూ ఎస్టి ఓటర్లు ఉన్నట్లు తుది జాబితాను అధికారులు చదివి వినిపించారని, అందరి ఆమోదంతో గ్రామసభ తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. దీని ఆధారంగానే రాబోయే ఎన్నికల రిజర్వేషన్లను ప్రకటిస్తారని, సెప్టెంబర్ 7న ఓటరు తుది జాబితాను విడుదల చేస్తారని అధికారులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రాజు, వెంకట్రావు, భగవాన్, లోబో, క్లాప్ మిత్ర లక్ష్మణ్, పంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైజాగ్‌లో మరోసారి పరుగుల సందడి

- అక్టోబర్ 4న హాఫ్ మారథాన్
- రూ.3 లక్షల నగదు బహుమతులు




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 04 :** వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4న 'వైజాగ్ హాఫ్ మారథాన్ 5వ ఎడిషన్'ను ఘనంగా నిర్వ హించనున్నట్లు రేస్ డైరెక్టర్ డాక్టర్ కె. కృష్ణ చైతన్య తెలిపారు. విశాఖపట్నంలోని దశపల్లా హోటల్‌లో శుక్రవారం నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో మారథాన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గీతం యూనివర్సిటీ ప్రాంగణం నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. వివిధ వయసుల రన్నర్లను దృష్టిలో ఉంచుకుని నాలుగు విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
పోటీల విభాగాలు 21కె -- హాఫ్ మారథాన్,10కె రన్,5కె రన్ 3కె రన్ ,వివిధ విభాగాల్లో విజేతలకు మొత్తం రూ.3 లక్షల నగదు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాభిమానులు, యువతతో పాటు రన్నింగ్‌పై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రిజిస్ట్రేషన్లు ప్రారంభం

మారథాన్‌లో పాల్గొనదలిచిన వారు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ వి.టి.ఆర్.ఎ. రన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు.
విలేకరుల సమావేశంలో వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్, ప్రతినిధులు శివ, శ్రీరామ్, యశ్వంత్, డీసీబీ బ్యాంక్‌కు చెందిన శ్రీనివాస్ ఆక్కుమహంతి, గీతం యూనివర్సిటీ డీన్ అరుణ్ కార్తీక్, జి కాన్ అవిస్మా తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ఛాన్స్ ఇవ్వండి సొలభం పంచాయతీని అభివృద్ధి చేసి చూపిస్తా లకే .రామకృష్ణ

**సొలభం హెడ్ క్వార్టర్ లో వీధి దీపాలు పంపిణీ.**



**జి.మాడుగుల.పెన్ పవర్.సెప్టెంబర్ 4** జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీలో లకే .రామకృష్ణ పంచాయతీలో గల వివిధ గ్రామాల ప్రజలతో సొలభం రచ్చ బండ వద్ద సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో పంచాయతీ ప్రెసిడెంట్ అభ్యర్థిగా బరిలో దిగనున్నట్టు ఈ రోజు నుండి ప్రజల సమస్యలను ప్రతి గ్రామానికి వెళ్లి తెలుసుకుంటామని తెలిపారు.సొలభం హెడ్ క్వార్టర్ లో అభివృద్ధికి నోచుకోని పనులు ఉన్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనని గెలిపిస్తే సొ లభం పంచాయితీని అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ గ్రామంలో ఇప్పటికీ డ్రైనేజ్
వ్యవస్థ, సిసి రోడ్స్, స్కూల్ భవనం, మంచినీరు సౌకర్యం లేకపోవడం వాటి విషయాలను గుర్తు చేశారు. గత ప్రభుత్వం పంచాయతీ నిధులను సర్పంచుల అనుమతులు లేకుండా నిధులు మళ్లించాయి. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ప్రతి పంచాయతీ అభివృద్ధికి నోచుకుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. పంచాయతీకి వచ్చే నిధులు ఏ విధంగా ఖర్చు జరుగుతుంది అనే విషయాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నారు. విద్య ఆరోగ్యం, పైన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తానని, పంచాయతీలో గల 56 గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుని, ఎప్పటికప్పుడు ప్రజలకు తోడుగా ఉంటానని తెలిపారు. సొలభం పంచాయతీ ప్రజలు ఆలోచించి ఓటును వెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలాసి కొత్తం నాయుడు, కొర్ర సోమేశ్వరరావు వంతల నాగేశ్వరావు వంతల జగ్గారావు, వనుగు పోతురాజు , యూత్ లీడర్ బన్నీ, సొలభం బాబు రావు , గణేష్ , లకే అబ్బాయి దొర, కృష్ణ కుమారి, వనుగు నీలకంఠమ్మ, కొర్ర నరసింగరావు , సీదారి రామన్న , మధుల బాల కృష్ణా,అజయ్,కామేష్ ,
లకే రాజాం దొర, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జగ్గంపేట హ్యాపీ చిల్డ్రన్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** జగ్గంపేట-గుర్రపాలెం రోడ్ తులా కాంప్లెక్స్ లో చిల్డ్రన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణ, గోపికమ్మల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నకిరెడ్డి నాగేశ్వరావు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఉట్టి కొట్టించారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన ముసుగులో విభేదాలు సృష్టిస్తే సహించేది లేదు-పోలం చిన్నా...



- జనసేన ముసుగులో వైసీపీ నేతల రాజకీయాలు సాగవు....
- కూటమి నేతల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలి....
- అభివృద్ధి జరుగుతుంటే వివాదాలు సృష్టించడం తగదు.....
- వాస్తవాలు పరిశీలించే మీడియా ప్రతినిధులు వార్తలు ప్రచురించాలి-పోలం చిన్నా....

**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 04:-** కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు వైసీపీ నాయకులు జనసేన ముసుగులో కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండపం టీడీపీ నేత పోలం చిన్న ఆరోపించారు ఇలాంటి రాజకీయాలు మండపం గ్రామంలో చెల్లవని హెచ్చరించారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా కొందరు వ్యక్తులు వివాదానికి తెరతీసి టీడీపీ నాయకుడిపై దాడికి పాల్పడ్డారని,ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడి కాలు విరిగినట్లు పోలం చిన్నా పేర్కొన్నారు.ఈ ఘటనపై ఇప్పటికే అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ ఘటనను టీడీపీ,జనసేన మధ్య విభేదాలుగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకులుగా చెప్పుకుంటున్న వారు ఎవరి సమక్షంలో పార్టీలో చేరారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.గతంలో ఆయా వ్యక్తులు ఏ రాజకీయ పార్టీకి పనిచేశారు, ఎన్నికల సమయంలో ఎవరికి మద్దతుగా వ్యవహరించారు,కూటమి అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారా అనే అంశాలను పరిశీలించిన తర్వాతే వార్తలను ప్రచురించాలని మీడియా ప్రతినిధులను కోరారు.జనసేన ముసుగులో వచ్చి కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పోలం చిన్నా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నాయకత్వంలో మండపం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటున్నామని అన్నారు. గ్రామంలో అభివృద్ధి జరుగుతున్న సమయంలో అనవసర వివాదాలు సృష్టించడం తగదని హితవు పలికారు. వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రజలకు సరైన సమాచారం అందించాలని మీడియా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ విద్యారంగంలో విశేష సేవలకు గుర్తింపు

**ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. కె. రవిశంకర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు**



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 4:**సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. కె. రవిశంకర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025--26 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఫార్మసీ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా. ఎన్. సతీష్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డా. రవిశంకర్ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఫార్మసీ రంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు విశేషంగా కృషి చేస్తూ పలు విలువైన పుస్తకాలను రచించారని తెలిపారు.


క్లినికల్ ఫార్మసీ అండ్ ఫార్మాకోథెరప్యూటిక్స్, ఫార్మసీ కాలేజీ--ఏ కాంప్రెహెన్సివ్ అప్రోచ్, కంపానియన్ హ్యాండ్‌బుక్, సోషల్ అండ్ ప్రివెంటివ్ ఫార్మసీ తదితర పుస్తకాలను రచించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. అదేవిధంగా ఇన్ విట్రో యాక్టివిటీస్ ఆఫ్ ఆస్పరాగస్ రేసిమోసస్ రూట్ ఎక్స్‌ట్రాక్ట్స్, ఫార్మకాలాజికల్ యాక్టివిటీస్ ఆఫ్ ఆండ్రోగ్రాఫిస్ సెర్ఫిల్లిఫోలియా వంటి పరిశోధనా గ్రంథాలను కూడా ప్రచురించారని వివరించారు.

దేశ, విదేశాల్లో నిర్వహించిన అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని విజ్ఞానదాయకమైన ఉపన్యాసాలు అందించడంతో పాటు, జేఎన్‌టీయూకే, ఆంధ్రా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, నాగార్జున యూనివర్సిటీ, డా. ఎం.జీ.ఆర్. యూనివర్సిటీలకు ఎగ్జామినర్‌గా సేవలందించారని తెలిపారు. చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా, పలు ప్రముఖ జర్నళ్ల ఎడిటోరియల్ బోర్డుల్లో సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఫార్మసీ విద్యా రంగంలో డా. రవిశంకర్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఫార్మసీ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయమని డా. సతీష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డా. రవిశంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో వైస్ ఛాన్సలర్లు, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది డా. రవిశంకర్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## భక్త శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు.....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 04:-** శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు ఘనంగా జరుపుకున్నారు
కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి లో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల శ్రీ వేణుమాధవ్ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు .సుందరంగా అలంకరించిన వేదికపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా ఆలయ చైర్మన్ కాలింగ్ నూకరాజు ఆధ్వర్యంలో పురోహితులు వేమకోటి త్రినాథ్ శర్మ సత్య నారాయణ శర్మ వేదమంత్రోచ్ఛర్లనల మధ్య విగ్నేశ్వర పూజ, శుద్ధి పుణ్యాహవాచనం , మండపారాధన నవగ్రహారాధన ,శ్రీ సూక్తం పురుష సూక్తం రుద్ర నమకం చమకం, అష్టోత్తర శతనామం తో పాటు స్వామివారికి పంచామృత అభిషేకం గావించారు . అనంతరం మంత్రపుష్పం నీరాజనం నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి నూతన పట్టు వస్త్రాలు వివిధ జాతుల పుష్పమాలలతో అలంకరించడంతో స్వామి వారు దేదీప్యమానంగా దర్శనమిచ్చరు. అనంతరం పలువురు చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో వచ్చి స్వామివారి దర్శించుకున్నారు . గ్రామస్తులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు విప్పర్తి సూర్యచంద్రం ఎంపిక

**నరసన్నపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినికి అరుదైన గౌరవం**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4:**ఆత్రేయపురం శివారు నరసన్నపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న విప్పర్తి సూర్యచంద్రం 2026 సంవత్సరానికి సంబంధించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు మండల విద్యాశాఖ అధికారులు పీవీ ప్రసాదరావు, ఎ. సత్యనారాయణ తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, బోధనలో వినూత్న పద్ధతులను అనుసరించడం వంటి అంశాల్లో ఆమె అందించిన సేవలను గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

గురుపూజోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న అమలాపురంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. గౌరవ ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో విప్పర్తి సూర్యచంద్రంను ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల నరసన్నపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు అభినందనలు తెలియజేస్తూ, ఈ అవార్డు ఉపాధ్యాయ వృత్తిలో మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

## అభివృద్ధి అంటే రైతు పండించిన పంటను కూల్చడమా



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** కాకినాడ జిల్లా జగ్గంపేట గ్రామపంచాయతీ పరిధి జటాద్రి కొండపై గత 40 సంవత్సరాల నుంచి పేద రైతులు మామిడి, జీడి మామిడి పండించుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ పంటను ప్రభుత్వం పీ ఎం కుసుమ సోలార్ ప్రాజెక్ట్ కింద పేదప్రజల పండించిన, పెంచుకున్న చెట్లను జెసిబిలతో తీసివేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, కొత్తూరు గ్రామ నాయకులు, జగ్గంపేట ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర బృందం, రైతులతో కలిసి శుక్రవారం జటాద్రి కొండపైకి వెళ్లి పనులు చేస్తున్న జెసిబి ని అడ్డుకొని, పని ఆపివేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇండిపెండెంట్ అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రాలకు రైతే రారాజు అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వాలు ఎంతో కష్టపడి, కావులతో కొండపైకి నీళ్లు మోసి పంట పండించుకుంటే, ప్రభుత్వశీ పథకాలు పేరు చెప్పి రైతుల పొట్ట కొట్టడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఈ దోపిడీ వ్యవస్థలో రైతులు బతికే ప్రసక్తే లేదా అని ప్రశ్నించారు. రెవిన్యూ యంత్రాంగం మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందని, బడా భూస్వాములకు వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జటాద్రి కొండపై ప్రాజెక్ట్ పెట్టనీయమని,రైతుల పక్షాన ఉండి ఎంతైనా పోరాటం చేస్తామని, కూటమి ప్రభుత్వం పేద రైతుల విషయంలో ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రజాగ్రహానికి గురికాక తప్పని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, రామలింగేశ్వరరావు, జాను, ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర బృందం, కొత్తూరు గ్రామ నాయకులు నకిరెడ్డి నాగేశ్వరరావు, పెదకాపు, రైతులు నూకరాజు, శ్రీనివాసరావు, నాని, నాగేంద్ర, గంగరాజు, ధర్మరాజు,తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి సత్యవతి కుటుంబానికి టీడీపీ అండ



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4 :** మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యురాలు ర్యాలి సత్యవతి అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబానికి టీడీపీ నాయకులు అండగా నిలిచారు. పార్టీ తరఫున అందిస్తున్న ప్రమాద బీమా పథకం ద్వారా సత్యవతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఆ కుటుంబ సభ్యులకుఅందించారు.

ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పార్టీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం కొంతమేర భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ర్యాలి గ్రామ టీడీపీ అధ్యక్షులు పెండెం వెంకన్న, యూనిట్ ఇన్‌చార్జ్ కందుల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర గౌడ్, మెర్ల నాగేశ్వరరావు, బూట్ ఇంచార్జ్ అత్తిలి చిరంజీవి. చేకూరి సత్తిపండు , అమర్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సత్యవతి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి

- రూ.20 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల భవనం ప్రారంభం





**రావులపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 4:**కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం రావులపాలెం మండలం దేవరపల్లి శివారు తిమ్మప్ప దొడ్డిలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను నూతన పాఠశాల భవనంలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యనభ్యసించేందుకు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

గతంలో ప్రభుత్వ పాఠశాలలపై కొంత చిన్నచూపు ఉండేదని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తే వారు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రతిభ కనబరచగలరని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. నూతన పాఠశాల భవనం అందుబాటులోకి రావడంతో తిమ్మప్ప దొడ్డి ప్రాంతంలోని విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

## నేడు కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4 :** ఈనెల 5వ తేదీన కాకినాడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే ప్రతిష్టాత్మకమైన కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా హాజరు కావాలని జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మరోతి శివ గణేష్ కోరారు. కేంద్ర మాజీ మంత్రి ఎం ఎం పల్లంరాజు ఆదేశాలతో కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరవేసి కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై జెండా రెపరెపలాడించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని కొన్ని నెలల పాటు నిర్విరామంగా జరుపుతామని శివ గణేష్ పేర్కొన్నారు.

# ర్యాలిలో వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు





భక్తిశ్రద్ధలతో విశేష పూజలు.. స్వామివారి సేవలో తరించిన భక్తజనం

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4:**ఆధ్యాత్మిక వైభవానికి, విశిష్టమైన దేవతా స్వరూపానికి ప్రసిద్ధిగాంచిన ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి దేవస్థానంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్షేత్రపాలకులైన శ్రీ గోపాల స్వామివారి సన్నిధిలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం చందనం, నవనీతములతో స్వామివారిని సుందరంగా అలంకరించి సహస్రనామ పూజ చేపట్టారు. అమ్మవార్లకు కుంకుమ పూజ, గోపూజ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు, దాతలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.శ్రీ జగన్మోహిని కేశవ స్వామి దేవస్థానం విశిష్టత కారణంగా భక్తుల్లో ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంది. ఆలయంలోని మూలవిరాట్‌కు ముందు భాగంలో కేశవ స్వామి, వెనుక భాగంలో జగన్మోహిని రూపం దర్శనమివ్వడం ఈ క్షేత్ర ప్రత్యేకతగా భక్తులు భావిస్తారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి, ద్వారపురెడ్డి సురేష్ బాబు ఆలయ సిబ్బంది తదితరులు స్వామివారి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కృష్ణాష్టమి వేడుకలు ప్రశాంతంగా, భక్తిమయ వాతావరణంలో సాగడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.


# ప్రజాదర్బార్‌తో ప్రజలకు భరోసా



- 39 వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.. ...
- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**రావులపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 4:**ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో వారి చెంతకే వచ్చి వినతులు స్వీకరిస్తున్నామని తెలిపారు.రావులపాలెం మండలం దేవరపల్లి మట్లదొడ్డిలో శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా 39 వినతులను స్వీకరించి, ప్రతి సమస్యను ఓపికగా విని వివరాలు తెలుసుకున్నారు.వినతుల్లో ప్రధానంగా స్థానిక సమస్యలు, మౌలిక వసతులు, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలు సమర్పించిన పలు వినతులపై ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ఇక మిగిలిన వినతులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యల స్వభావాన్ని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని అధికారులు బాధ్యతగా తీసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు.

ప్రజల సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే అవకాశం లభించడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





**కాకినాడ జిల్లా : పిఠాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4.**

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం లో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పాదగయా క్షేత్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు...

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఐదు బ్యాచ్ లు లో సుమారు 12వేల మంది ఆడపడుచులు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించేలా ఏర్పాట్లు చేసిన ఆలయ అదికారులు...

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు ప్రారంభించిన పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కేకే , పెండెం దొరబాబు, తుమ్మలబాబు, పంతం నానాజీ...

వరలక్ష్మి వ్రత పూజ కార్యక్రమం అనంతరం పవన్ కళ్యాణ్ పంపించిన పసుపు , కుంకుమ, చీర , రూపు తో కూడిన కానుక గా అందించిన పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కె.కె , ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు పెండెం దొరబాబు, తుమ్మల బాబు , ఓదూరి కిషోర్ , జనసేన నాయకులు..

# వాడపల్లి ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు.. భక్తిశ్రద్ధలతో పూజలు

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4:** కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలు వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ క్షేత్రపాలకుడైన శ్రీ వేణుగోపాల స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఉదయాన్నే స్వామివారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించి, అనంతరం పవిత్ర జలాలతో అభిషేక కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వివిధ సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మంగళహారతులు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను భక్తులకు అందించారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. శ్రీ వేణుగోపాల స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా, సంప్రదాయబద్ధంగా ముగిశాయి. శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా వాడపల్లి క్షేత్రం భక్తి, ఆధ్యాత్మికతతో కళకళలాడింది.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com